# ఓం పోతుకూచి

నారదుని పూర్వ జన్మ వృత్తాంతమును చెప్పుమని వ్యాస మహర్షి కోరెను. తను పూర్వ కల్పములో వేదవేత్తల వారిండ్లలో పనిచేసే ఒక దాసీ పుత్రుడనని, వారికి పరిచర్యలు గావించగా వారు తనను అనుగ్రహించి వాసుదేవుని మాయను తెలిపెనని, కర్మలను భగవదార్పితముచేసినచో కర్మ బంధములను తొలగించుకొనవచ్చని వారు చెప్పెను. అటు పిమ్మట తన తల్లి మరణించగా, ఇక తనకు హరినామమే శరణ్యమని తలచి తను అడవులకేగి ఎంతో అలసిపోయి ఒక రావి చెట్టు క్రింద సేదతీర్చుకొని, ధ్యానము చేయుచుండగా, భగవంతుడు తన మనసులో ప్రత్యక్షమయ్యెను. కనులు తెరచి చూడగా మాయమయ్యెను. ఆ అడవిలో ఎంత వెదకి వేసారినా, మరల ఆ రూపము కనిపించలేదు. అప్పుడు ఈ పద్యములో చెప్పిన విధముగా, తనను ఓదార్చుచున్నట్లుగా ఈ వచనములు వినవచ్చెను.

ఏల కుమార శోషిలగ నీ జననంబున నన్నుఁ గానఁగా
జాలవు నీవు కామముఖషట్కము నిర్దళితంబు సేసి ని
ర్మూలితకర్ములైన మునిముఖ్యులుగాని కుయోగి గానఁగాఁ
జాలఁడు నీదు కోర్కి కొనసాగుటకై నిజమూర్తిఁ జూపితిన్

ఓ కుమారా అన్న పానములు లేక ఇలా అలసి పోవుట ఎందుకు? ఈ నీ జన్మమున నన్ను చూడలేవు నీవు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు అను ఆరు శత్రు సమూహమును పూర్తిగా ఖండించి కర్మలనన్నింటిని నిర్మూలనము గావించిన శ్రేష్ఠమైన మునులు మాత్రమే చూడగలరు, కాని యోగమున అధముడైనవాడు అనగా యోగమునందు పరిపక్వత లేని వాడు చూడలేడు. నీ మనస్సున నన్ను చూడవలెనన్న కోరిక ను కొనసాగించుటకు గాను నా రూపమును తాత్కాలికముగా నీకు చూపితిని. అని సాక్షాత్తు ఆ భగవంతుడే నారదునికి చెప్పెను.